रजिस्ट्री सं डी—२२१
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య డి--221

विधायी II अनुभाग
राजभाषा खण्ड
डा. सं..............
तारीख.........

मूल्य रु 5.00 पैसे
[Price Rs. 5.00 Paise.
మూల్యము : రూ. 5.00 పైసలు

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
EXTRAORDINARY
అసాధారణ

भाग XVI अनुभाग 1
Part XVI Section 1
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
PUBLISHED BY AUTHORITY
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | |
|---|---|---|---|---|
| सं १ | नई दिल्ली | सोमवार | ९ जून २००८/२० वैशाख | खंड १५ |
| No. 1 | New Delhi | Monday | 9 June, 2008/20 Vaishakha | Vol. 15 |
| సంఖ్య 1 | న్యూఢిల్లీ | సోమవారము | 9 జూన్, 2008/20 వైశాఖ | సంపుటము15 |

## MINISTRY OF LAW AND JUSTICE
## (LEGISLATIVE DEPARTMENT)

New Delhi, 10th March, 2008/18 Maga, 1930 Servadari

The Translations in Telugu of the following Acts namely:-

(1) The Working Journalists and Other Newspaper Employees (Conditions of Service) and Miscellaneous Provisions Act, 1955 (Act No. 45 of 1955); (2) The University Grants Commission Act, 1956 (Act No. 3 of 1956); (3) The Medicinal and Toilet Preparations (Exercise Duties) Act, 1955 (Act No. 16 of 1955); (4) The Prevention of Cruelty to Animals Act, 1960 (Act No. 59 of 1960) and (5) The National Commission for Women Act, 1990 (Act No. 20 of 1990) are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Texts thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Texts (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

# శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ
## (శాసన నిర్మాణ విభాగము)

ఈ క్రింది చట్టములు, అనగా:-

(1) వర్కింగు జర్నలిస్టుల మరియు ఇతర వార్తాపత్రిక ఉద్యోగుల (సేవా షరతులు) మరియు వివిధ నిబంధనల చట్టము, 1955 (1955 లోని 45వ చట్టము); (2) విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషను చట్టము, 1956 (1956 లోని 3వ చట్టము); (3) ఔషధీయ మరియు ప్రసాధన ద్రవ్యముల తయారీ (ఎక్సైజు సుంకముల) చట్టము, 1955 (1955 లోని 16వ చట్టము); (4) జంతువులపట్ల క్రూరత్వ నివారణ చట్టము, 1960 (1960 లోని 59వ చట్టము) మరియు (5) జాతీయ మహిళా కమీషను చట్టము, 1990 (1990 లోని 20వ చట్టము)ల యొక్క తెలుగు అనువాదములను రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టములకు గల ఈ అనువాదములను ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973 లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఏ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషను చట్టము, 1956

(1956 లోని 3వ చట్టము)

(3 మార్చి, 1956)

**విశ్వవిద్యాలయాల్లోని ప్రమాణాలను సమన్వయపరచుటకును, నిర్ధారణచేయుటకును, మరియు అందు నిమిత్తం విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషను నొకదానిని స్థాపించుటకును నిబంధనలు చేయుటకైన చట్టము.**

భారత గణరాజ్యం యొక్క ఏడవ సంవత్సరంలో పార్లమెంటుచే ఈ క్రింది విధంగా శాసనము చేయడమైనది:-

## అధ్యాయము - 1

## ప్రారంభిక

1. (1) ఈ చట్టాన్ని విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషను చట్టము, 1956 అని పేర్కొనవచ్చును. సంగ్రహనామము మరియు ప్రారంభము.

(2) ఇది కేంద్ర ప్రభుత్వం రాజపత్రంలో అధిసూచన ద్వారా నియతం చేయునట్టి తేదీన *అమలులోనికి వచ్చును.

2. ఈ చట్టంలో సందర్భాన్నిబట్టి అర్థం వేరుగా ఉన్ననే తప్ప,- నిర్వచనములు.

(ఏ) "కమీషను" అనగా 4వ పరిచ్ఛేదం క్రింద స్థాపించిన విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషను అని అర్థము;

(బీ) విశ్వవిద్యాలయానికి సంబంధించి "కార్యపాలక ప్రాధికారి" అనగా విశ్వవిద్యాలయ సాధారణ పరిపాలన నిహితమైయున్నట్టి (ఏ పేరుతో వ్యవహరించునదైనను) ముఖ్య కార్యపాలక ప్రాధికారి అని అర్థము;

(సీ) "నిధి" అనగా 16వ పరిచ్ఛేదం క్రింద ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషను నిధి అని అర్థము;

(డీ) "సభ్యుడు" అనగా విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషను సభ్యుడు అని అర్థము; ఈ పదపరిధిలో అధ్యక్షుడు (ఛైర్మెను), ఉపాధ్యక్షుడు (వైస్-ఛైర్మను) చేరియుండురు;

(ఇ) "విహిత" అనగా ఈ చట్టము క్రింద చేసిన నియమాల ద్వారా విహిత పరచిన అని అర్థము;

(ఎఫ్) "విశ్వవిద్యాలయము" అనగా కేంద్ర చట్టము, ప్రొవిన్షియల్ చట్టము లేక రాజ్య చట్టము ద్వారా లేక దాని క్రింద స్థాపించిన లేక నిగమితమైన విశ్వవిద్యాలయమని అర్థము; ఈ పదపరిధిలో, ఈ చట్టము క్రింద ఈ విషయంలో చేసిన వినియమాల ననుసరించి, కమీషను సంబంధిత విశ్వవిద్యాలయంతో సంప్రదించి గుర్తించునట్టి ఏదేని సంస్థ చేరియుండును.

3. కేంద్ర ప్రభుత్వము, కమీషను సలహాపై, విశ్వవిద్యాలయం కానట్టి ఏదేని ఉన్నత విద్యా సంస్థను ఈ చట్టము నిమిత్తము విశ్వవిద్యాలయంగా భావించవలెనని రాజపత్రంలో అధిసూచన ద్వారా ప్రఖ్యానించవచ్చును. మరియు అట్లు విశ్వవిద్యాలయాలు కానట్టి ఉన్నత అధ్యయన సంస్థలకు చట్టము యొక్క వర్తింపు

---

* 5.11.1956 (ఎస్.ఆర్.ఓ. 2608, తేదీ 1.11.1956 ప్రకారం);

ప్రఖ్యానం చేసిన మీదట ఈ చట్టపు నిబంధనలన్నియు అట్టి సంస్థకు, అది 2వ పరిచ్ఛేదపు ఖండం (ఎఫ్) భావంలో ఒక విశ్వవిద్యాలయమైయుండిన ఎట్లో అట్లే వర్తించును.

## అధ్యాయము - 2

## కమీషను స్థాపన

కమీషను స్థాపన. 4. (1) కేంద్ర ప్రభుత్వము రాజపత్రంలో అధిసూచన ద్వారా నియతం చేయునట్టి తేదీ నుండి విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషను అను పేరుతో కమీషను నొకదానిని స్థాపించవలెను.

(2) సదరు కమీషను శాశ్వత ఉత్తరాధికారమును సామాన్య మొహరును కలిగి నిగమ నికాయముగా ఉండును. సదరు పేరుతో అది దావా వేయవచ్చును మరియు దానిపై దావా వేయబడవచ్చును.

కమీషను ఏర్పాటు 5. (1) కమీషను, కేంద్ర ప్రభుత్వము నియమించునట్టి ఈ క్రింది వారితో కూడియుండవలెను.

(i) అధ్యక్షుడు (ఛైర్మను),

(ii) ఉపాధ్యక్షుడు (వైస్-ఛైర్మను) మరియు

(iii) పది మంది ఇతర సభ్యులు.

(2) అధ్యక్షుడిని కేంద్ర ప్రభుత్వ అధికారులు గాని ఏదేని రాజ్య ప్రభుత్వ అధికారులు గాని కానట్టి వ్యక్తుల నుండి ఎంపిక చేయవలెను.

(3) ఉపపరిచ్ఛేదం (1) లోని ఖండం (iii)లో పేర్కొని ఇతర సభ్యులకు గాను-

(ఏ) ఇద్దరిని, కేంద్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించుటకై ఆ ప్రభుత్వాధికారులలో నుండి ఎంపిక చేయవలెను;

(బీ) ఎంపిక చేయునప్పుడు నలుగురికి తక్కువ కానంతమందిని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగానున్న వ్యక్తుల నుండి, ఎంపిక చేయవలెను; మరియు

(సీ) మిగతా వారిని ఈ క్రింది వ్యక్తులలో నుండి ఎంపిక చేయవలెను-

(i) వ్యవసాయము, వాణిజ్యము, అడవుల పెంపకము లేక పరిశ్రమల రంగాలలో విజ్ఞానము లేదా అనుభవము గలవారు;

(ii) ఇంజనీరింగు, న్యాయ, వైద్య లేక ఏదేని ఇతర విద్వత్ వృత్తులలోని వారు; లేక

(iii) విశ్వవిద్యాలయాల అధ్యక్షులు లేక విశ్వవిద్యాలయాల అధ్యాపకులు కానట్టి, కేంద్ర ప్రభుత్వం అభిప్రాయంలో ప్రఖ్యాతిగాంచిన విద్యావేత్తలు లేక ఉన్నతమైన విద్యావిషయక గౌరవములను పొందినవారు;

అయితే, ఈ ఖండం క్రింద ఎంపికచేసిన సభ్యులలో సగం కంటె తక్కువ కానంతమంది కేంద్ర ప్రభుత్వాధికారులు గాని ఏదేని రాజ్య ప్రభుత్వాధికారులు గాని కానట్టి వ్యక్తుల నుండి ఉండవలెను.

(4) ఉపాధ్యక్షుడు, అధ్యక్షుడని అధికారములలో విహితపరచినట్టి వాటిని వినియోగించవలెను; మరియు అట్టి కర్తవ్యములను నిర్వర్తించవలెను.

(5) ఈ పరిచ్ఛేదం క్రింద చేయు ప్రతి నియామకము, కేంద్ర ప్రభుత్వం రాజపత్రంలో దానిని అధిసూచించినట్టి తేదీనుండి ప్రభావం కలిగియుండును.

6. (1) విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషను (సవరణ) చట్టము, 1985 ప్రారంభమైన తరువాత అధ్యక్షుడుగా, ఉపాధ్యక్షుడుగా లేక ఇతర సభ్యుడుగా నియమింపబడిన వ్యక్తి, ఈ చట్టము క్రింద చేయు నియమాల క్రింద ఆ విధంగా కొనసాగుటకు అంతకుముందుగానే నిరర్హుడైననే తప్ప,- సభ్యుల సేవా నిబంధనలు, షరతులు.

(ఏ) అధ్యక్షుని విషయంలో, అయిదు సంవత్సరాల కాలంపాటు లేదా ఆయనకు అరవై అయిదు సంవత్సరాల వయస్సు వచ్చేంతవరకు - ఈ రెండింటిలో ఏది ముందో అంతవరకు పదవియందుండవలెను;

(బీ) ఉపాధ్యక్షుని విషయంలో, మూడు సంవత్సరాల కాలంపాటు లేదా ఆయనకు అరవై అయిదు సంవత్సరాల వయస్సు వచ్చేంతవరకు - ఈ రెండింటిలో ఏది ముందో అంతవరకు పదవియందుండవలెను;

(సీ) ఎవరేని ఇతర సభ్యుని విషయంలో మూడు సంవత్సరాల కాలంపాటు పదవియందుండవలెను;

అయితే-

(i) అధ్యక్షుడుగా లేదా ఉపాధ్యక్షుడుగా పదవియందుండిన వ్యక్తి అధ్యక్షుడుగా, ఉపాధ్యక్షుడుగా లేక ఇతర సభ్యుడుగా మరల నియమింపబడుటకు అర్హుడైయుండును, మరియు

(ii) ఏదేని ఇతర సభ్యుడుగా పదవియందుండిన వ్యక్తి అధ్యక్షుడుగా, ఉపాధ్యక్షుడుగా లేక ఇతర సభ్యుడుగా మరల నియమింపబడుటకు అర్హుడై యుండును;

అంతేకాక, అధ్యక్షుడుగా గాని, ఉపాధ్యక్షుడుగా గాని, లేక ఇతర సభ్యుడుగా గాని (5వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదం (3)కు గల ఖండం (ఎ)లో నిర్దేశించిన సభ్యుడు మినహా) ఏ హోదాలోనైనను రెండుసార్లు పదవియందున్న వ్యక్తి మరల అధ్యక్షుడుగా, ఉపాధ్యక్షుడుగా లేక ఇతర సభ్యుడుగా నియమింప బడుటకు అర్హుడుకాడు.

(2) సభ్యుడు తన చేవ్రాలుతో కేంద్ర ప్రభుత్వానికి లేఖ వ్రాయుట ద్వారా తన పదవికి రాజీనామా ఈయవచ్చును. అయితే కేంద్ర ప్రభుత్వం అతని రాజీనామాను అంగీకరించునంతవరకు అతడు పదవిలో కొనసాగవలెను.

(3) అధ్యక్షుడు మరణించినందువలన గాని, రాజీనామా చేసినందువలన గాని లేదా అస్వస్థత లేక ఇతర విధమైన అశక్తత కారణంగా తన కృత్యములను నిర్వర్తించలేక పోయినందున గాని అధ్యక్షుని పదవిలో ఆకస్మికంగా ఖాళీ ఏర్పడినచో తత్సమయమున ఉపాధ్యక్షుని పదవియందున్న వ్యక్తి, 5వ పరిచ్ఛేదపు ఉప పరిచ్ఛేదం (2)లో ఏమి ఉన్నప్పటికిని, అధ్యక్షుడుగా వ్యవహరించవలెను. మరియు ఎవరేని ఇతర వ్యక్తిని అంతకుముందుగానే అధ్యక్షునిగా నియమించిననే తప్ప, ఎవరి స్థానంలో అతడు అట్లు వ్యవహరించవలసియున్నదో ఆ వ్యక్తి యొక్క పదవీ కాలావధిలో మిగిలిన కాలంపాటు అధ్యక్షుని పదవియందుండవలెను:

అయితే, అధ్యక్షుని పదవిలో ఖాళీ ఏర్పడినప్పుడు ఉపాధ్యక్షుని పదవి యందు ఎవరును లేనియెడల, కేంద్ర ప్రభుత్వం, 5వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదం (2)లో ఏమి ఉన్నప్పటికిని, అధ్యక్షునిగా వ్యవహరించుటకు ఎవరేని ఇతర సభ్యుని నియమించవలెను. మరియు అట్లు నియమించబడిన వ్యక్తి, ఆరుమాసాల కాలావధికి మించి అధ్యక్షుని పదవియందుండరాదు.

(4) ఉపాధ్యక్షుడు లేదా ఎవరేని ఇతర సభ్యుడు మరణించినందున గాని, రాజీనామా చేసినందున గాని లేదా అస్వస్థత లేక ఇతర విధమైన అశక్తత కారణంగా తన కృత్యములను నిర్వర్తించలేక పోయినందునగాని అట్టి పదవిలో ఆకస్మికంగా ఖాళీ ఏర్పడినచో, కేంద్ర ప్రభుత్వం క్రొత్తగా నియమించుట ద్వారా అట్టి ఖాళీని భర్తీ చేయవలెను మరియు అట్లు నియమించబడిన సభ్యుడు మూడు సంవత్సరాల కాలం పాటు పదవియందుండవలెను.

(5) అధ్యక్షుని పదవి, ఉపాధ్యక్షుని పదవి పూర్తికాలికమైనదై వేతనము గలదైయుండును; అందుకులోబడి, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మరియు ఇతర సభ్యుల సేవా నిబంధనలు, షరతులు విహితపరచునట్టివైయుండును.

కమీషను సమావేశములు.

7. ఈ చట్టము క్రింద చేసిన వినియమాల ద్వారా నిబంధించునట్టి సమయము లందును, స్థలములలోను కమీషను సమావేశం కావలెను. మరియు సమావేశము లందు జరుపు కార్యకలాప నిర్వహణను గురించి ఆ వినియమాలలో నిబంధించునట్టి ప్రక్రియా నియమావళిని పాటించవలెను.

సభ్యుల పదవుల లోని ఖాళీల వలన లేదా కమీషను ఏర్పాటు లోని లోపం వలన కమీషను యొక్క కార్యములు లేక చర్యలు శాసన మాన్యత లేనివి కాకుండుట.

8. కమీషను చేసిన ఏ కార్యమైనను, తీసికొన్న ఏ చర్యయైనను ఆ కమీషనులో ఏదేని ఖాళీవున్నదను లేక కమీషను ఏర్పాటులో ఏదేని లోపంవున్నదను కారణ మాత్రముననే శాసనమాన్యత లేనివిగా భావించరాదు.

ప్రత్యేక ప్రయోజనముల కొరకు కొంత మంది వ్యక్తులకు కమీషనుతో తాత్కాలికముగా సంబంధమును ఏర్పరచుట.

9. (1) కమీషను, ఈ చట్టములోని ఏవేని నిబంధనలను అమలుపరచుటలో ఎవరేని వ్యక్తి సహాయం లేదా సలహా తమకు కావలెనను కొనినచో, ఈ చట్టం క్రింద చేసిన వినియమాల ద్వారా నిర్ధారణ చేయదగునట్టి రీతిలోను, అట్టి ప్రయోజనముల కొరకును ఆ వ్యక్తికి తమతో సంబంధము ఏర్పరచవచ్చును.

(2) ఏదేని ప్రయోజనం కొరకు ఉపపరిచ్ఛేదం (1) క్రింద కమీషను తమతో సంబంధం ఏర్పరచిన వ్యక్తికి, ఆ ప్రయోజనమునకు సంబద్ధమైన చర్చ లలో పాల్గొనుటకు హక్కువుండును. అయితే, కమీషను సమావేశంలో వోటు చేయుటకు అతనికి హక్కు ఉండదు. మరియు ఇతర ఏ ప్రయోజనం కొరకైనను అతడు సభ్యుడు కాడు:

10. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం చేయునట్టి నియమాలకు లోబడి కమీషను, ఒక కార్యదర్శిని, ఈ చట్టము క్రింది తమ కృత్యములను సమర్థవంతంగా నిర్వహించుటకు తాము ఆవశ్యకమని తలచునట్టి ఇతర ఉద్యోగులను నియమించవచ్చును. ఆ ఉద్యోగుల సేవా నిబంధనలు, మరియు షరతులు కమీషను నిర్ధారణ చేయునట్టివైయుండును. కమీషను సిబ్బంది.

11. కమీషను యొక్క ఉత్తరువులను, నిర్ణయములను అన్నిటిని ఛైర్మెను గాని ఈ విషయంలో కమీషనుచే ప్రాధికారం పొందిన ఎవరేని ఇతర సభ్యుడు గాని సంతకముచేసి అధిప్రమాణీకరించవలెను; కమీషను జారీచేసిన ఇతర పత్రములన్నిటిని కార్యదర్శిగాని ఈ విషయంలో అదేవిధంగా ప్రాధికారం పొందిన కమీషను యొక్క ఎవరేని ఇతర అధికారి గాని సంతకముచేసి అధిప్రమాణీకరించవలెను. కమీషనుయొక్క ఉత్తరువులు మరియు ఇతర పత్రముల అధిప్రమాణీకరణ

## అధ్యాయము – 3

## కమీషను అధికారములు, మరియు కృత్యములు

12. విశ్వవిద్యాలయ విద్యను అభివృద్ధిచేసి సమన్వయపరచుటకును, విశ్వవిద్యాలయాలలో బోధన; పరీక్ష మరియు పరిశోధన ప్రమాణాలను నిర్ధారణచేసి కాపాడుటకును సంబంధిత విశ్వవిద్యాలయాలతో లేదా ఇతర నికాయములతో సంప్రదించి తాము సబబని తలచునట్టి చర్యలన్నింటిని తీసుకొనుట కమీషను యొక్క సాధారణ కర్తవ్యమైయుండును. ఈ చట్టము క్రింది తమ కృత్యములను నిర్వర్తించు నిమిత్తం కమీషను– కమీషను కృత్యములు.

(ఏ) విశ్వవిద్యాలయాల ఆర్థిక అవసరాలను గురించి పరిశీలించవచ్చును;

(బీ) ఏదేని కేంద్ర చట్టము ద్వారా లేక దాని క్రింద స్థాపించబడిన లేదా నిగమితమొనర్చబడిన విశ్వవిద్యాలయాల నిర్వహణకు వాటిని అభివృద్ధిపరచుటకు లేదా ఏదేని ఇతర సాధారణ లేక నిర్దిష్ట ప్రయోజనం కొరకు కమీషను నిధి నుండి అట్టి విశ్వవిద్యాలయాలకు గ్రాంట్లను కేటాయించి పంపిణీ చేయవచ్చును;

(సీ) ఇతర విశ్వవిద్యాలయాల అభివృద్ధి కొరకు లేదా అట్టి విశ్వవిద్యాలయాలకు సంబంధించి నిర్దిష్టపరచబడిన ఏవేని కార్యకలాపాల నిర్వహణకు, లేక వాటి అభివృద్ధికి లేక రెండింటికి లేదా ఏవేని ఇతర సాధారణ లేక నిర్దిష్ట ప్రయోజనం కొరకు కమీషను నిధి నుండి తాము ఆవశ్యకమని లేక సముచితమని భావించునట్టి గ్రాంట్లను కేటాయించి పంపిణీ చేయవచ్చును:

అయితే, కమీషను ఏదేని అట్టి విశ్వవిద్యాలయానికి ఏదేని గ్రాంటును ఇచ్చుటలో, సంబంధిత విశ్వవిద్యాలయము యొక్క అభివృద్ధిని దాని ఆర్థిక అవసరాలను, అది సాధించిన ప్రమాణాలను, అది నెరవేర్చగల జాతీయ ప్రయోజనాలను తగు రీతిగా దృష్టియందుంచుకొనవలెను.

(సీసీ) 3వ పరిచ్ఛేదం క్రింద కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రఖ్యానమును పురస్కరించుకొని విశ్వవిద్యాలయాలుగా భావింపబడిన సంస్థలకు, ఈ క్రింద పేర్కొన్న ఒకటి లేక అంతకు ఎక్కువ ప్రయోజనాల కొరకు తాము ఆవశ్యకమని భావించునట్టి గ్రాంట్లను కమీషను నిధి నుండి కేటాయించి పంపిణీ చేయవచ్చును, అవేవనగా:–

(i) ప్రత్యేక సందర్భాలలో నిర్వహణ కొరకు;

(ii) అభివృద్ధి కొరకు;

(iii) ఏదేని ఇతర సాధారణ లేక నిర్దిష్ట ప్రయోజనం కొరకు;

(సీసీసీ) విశ్వవిద్యాలయాల యొక్క ఏదేని సముదాయమునకు లేదా సాధారణంగా విశ్వవిద్యాలయాలకు ఉమ్మడి సౌకర్యాలను, సేవలను మరియు కార్యక్రమాలను ఏర్పాటు చేయుటకై ఈ చట్టము క్రింద చేసిన వినియమాల ననుసరించి సంస్థలను స్థాపించి అట్టి సంస్థలను నిర్వహించవచ్చును లేదా కమీషను ఆవశ్యకమని భావించునట్టి గ్రాంట్లను కమీషను నిధి నుండి కేటాయించి పంపిణీ చేయుట ద్వారా అట్టి సంస్థల నిర్వహణ కొరకు ఏర్పాటు చేయవచ్చును;

(డీ) విశ్వవిద్యాలయ విద్యను మెరుగుపరచుటకై ఆవశ్యకమైన చర్యలను ఏదేని విశ్వవిద్యాలయమునకు సిఫారసు చేయవచ్చును మరియు అట్టి సిఫారసును కార్యాన్వితం చేయుటకై చేపట్టదగు చర్యను గురించి ఆ విశ్వవిద్యాలయమునకు సలహా నొసగవచ్చును;

(ఇ) ఏదేని సాధారణ లేదా నిర్దిష్ట ప్రయోజనం కొరకు భారత సంచిత నిధి లేదా, సదర్భానుసారంగా, రాజ్య సంచిత నిధి నుండి విశ్వవిద్యాలయాలకు ఏదేని గ్రాంట్లను కేటాయించుటను గురించి కేంద్ర ప్రభుత్వానికి లేదా ఏదేని రాజ్య ప్రభుత్వానికి సలహా నొసగవచ్చును;

(ఎఫ్) క్రొత్త విశ్వవిద్యాలయమును స్థాపించుటను గురించి లేదా ఏదేని విశ్వవిద్యాలయ కార్యకలాపాల విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలను గురించి, సలహాను అడిగినచో ఎవరేని ప్రాధికారికి అట్టి సలహా నొసగవచ్చును;

(జీ) సందర్భానుసారంగా, కేంద్ర ప్రభుత్వం లేదా ఏదేని రాజ్య ప్రభుత్వం లేదా విశ్వవిద్యాలయం కమీషనుకు నిర్దేశించునట్టి ఏదేని ప్రశ్నను గురించి కేంద్ర ప్రభుత్వానికి లేదా ఆ రాజ్య ప్రభుత్వానికి లేదా విశ్వవిద్యాలయానికి సలహా నొసగ వచ్చును;

(హెచ్) భారతదేశంలోని మరియు ఇతర దేశాలలోని విశ్వవిద్యాలయ విద్యకు సంబంధించి తాము సబబని తలచునట్టి విషయాలన్నింటిని గురించి సమాచారమును సేకరించి దానిని ఏ విశ్వవిద్యాలయమునకైనను లభ్యమగునట్లు చేయవచ్చును;

(ఐ) ఏదేని విశ్వవిద్యాలయము యొక్క ఆర్థిక స్థితికి సంబంధించి లేదా ఆ విశ్వవిద్యాలయంలో చేపట్టిన వివిధ విద్వత్తు శాఖలకు సంబంధించి ఆవశ్యకమగు నట్టి సమాచారంతోపాటు ఆ విశ్వవిద్యాలయం అట్టి ఒక్కొక్క శాఖలో బోధనా ప్రమాణాలకు, పరీక్షా ప్రమాణాలకు సంబంధించిన నియమాలు మరియు వినియమా లన్నింటిని తమకు అందజేయవలసిందిగా ఆ విశ్వవిద్యాలయమును కోరవచ్చును;

(జె) విహితపరచబడునట్టి లేదా భారతదేశంలో ఉన్నత విద్యను పెంపొం దింపజేయుటకై ఆవశ్యకమని కమీషను భావించునట్టి లేదా పై కృత్యముల నిర్వహణకు అనుషంగికమగునట్టి లేదా దోహదకరమగునట్టి ఇతర కృత్యములను నిర్వర్తించవచ్చును.

12-ఎ. (1) ఈ పరిచ్ఛేదంలో,–

కొన్ని సందర్భాలలో ఫీజులను క్రమబద్ధం చేయుట, విరాళములను నిషేధించుట.

(ఏ) కళాశాలకు సంబంధించి వ్యాకరణ రూపాంతరములతో "అనుబంధము" అను పదపరిధిలో విశ్వవిద్యాలయం అట్టి కళాశాలను గుర్తించుట లేదా అట్టి కళాశాలకు విశ్వవిద్యాలయంతో సంబంధమును ఏర్పరచుట మరియు విశ్వ విద్యాలయ విశేషాధికారాలను అట్టి కళాశాలకు ఇచ్చుట చేరియుండును.

(బీ) "కళాశాల" అనగా కళాశాల అనినను మరేమని అనినను ఒక విశ్వ విద్యాలయం నుండి ఏదేని అర్హతను పొందుటకై పాఠ్యక్రమాలను (అధ్యయన కోర్సు) ఏర్పాటు చేయునట్టియు, ఆ విశ్వవిద్యాలయపు నియమములను, వినియమముల ననుసరించి, అట్టి పాఠ్యక్రమమును ఏర్పాటు చేయుటకు, వాటిని అభ్యసిస్తున్న విద్యార్థులను అట్టి అర్హతను పొందుటకైన పరీక్షకు హాజరు పరచుటకు సమర్థతగలదిగా గుర్తింపు పొందినట్టియు ఏదేని సంస్థ అని అర్థము;

(సీ) పాఠ్యక్రమానికి సంబంధించి "అధ్యయనం చేయుట" అను పద పరిధిలో పాఠ్యక్రమంలో ఒక భాగం నుండి మరొక భాగానికి లేదా ఒక దశ నుండి మరొక దశకు పురోగమించుట చేరియుండును;

(డీ) "అర్హత" అనగా విశ్వవిద్యాలయం ప్రదానంగా చేసిన డిగ్రీ లేక మరేదేని అర్హత అని అర్థము;

(ఇ) "వినియమాలు" అనగా ఈ చట్టము క్రింద చేసిన వినియమాలు అని అర్థము;

(ఎఫ్) "నిర్దిష్ట పాఠ్యక్రమము" అనగా ఏ పాఠ్యక్రమం విషయంలో ఉపపరిచ్ఛేదం (2)లో పేర్కొనిన స్వభావంగల వినియమాలను చేయడమైనదో ఆ పాఠ్యక్రమమని అర్థము;

(జీ) "విద్యార్థి" అను పదపరిధిలో విద్యార్థిగా ప్రవేశమును పొంద గోరుచున్న వ్యక్తి చేరియుండును;

(హెచ్) "విశ్వవిద్యాలయము" అనగా 22వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదం (1)లో నిర్దేశించిన విశ్వవిద్యాలయమని లేక సంస్థయని అర్థము;

(2) 12వ పరిచ్ఛేదపు నిబంధనల వ్యాపకతకు భంగం లేకుండా, ఈ క్రింది వాటిని (అవేవనగా)–

(ఏ) ఏదేని విశ్వవిద్యాలయం నుండి ఏదేని అర్హతను పొందుటకైన ఏదేని పాఠ్యక్రమం యొక్క స్వభావమును;

(బీ) అట్టి అర్హతను పొందుచున్న వ్యక్తులు ఆ అర్హత ఆధారంగా పనిచేయుటకు అవకాశం గల్గ కార్యకలాపాల తరహాలను;

(సీ) అట్టి అర్హత కలిగిన వ్యక్తి అట్టి కార్యకలాపాలకు సంబంధించి తన పనిలో పొందవలసిన కనీస ప్రమాణాలను మరియు ఏ అభ్యర్థియు ఆర్థిక శక్తిమూలంగా అట్టి పాఠ్యక్రమంలో ప్రవేశమును పొందుటకు తత్పర్యవసానంగా

మరింత ప్రతిభావంతుడైన అభ్యర్థి ఆ పాఠ్యక్రమంలో ప్రవేశం పొందకపోవుటను వీలైనంతవరకు జరుగకుండునట్లు చూడవలసిన అవసరమును; మరియు

(డి) సంబద్ధమైన అంశములన్నింటిని దృష్టిలో ఉంచుకొని ప్రజాహితం దృష్ట్యా అవశ్యకమని కమీషను అభిప్రాయపడినచో, సంబంధిత విశ్వవిద్యాలయముతో లేదా విశ్వవిద్యాలయములతో సంప్రదించి వినియమాల ద్వారా, అట్టి పాఠ్యక్రమమును ఏర్పాటు చేయు ఏదేని కళాశాల ఆ పాఠ్యక్రమంలో ప్రవేశించుటకు లేక దానిని చదువుటకు సంబంధించి, ఎవరేని విద్యార్థి నుండి లేక ఆ విద్యార్థికి సంబంధించి ఏ విషయముల బాబతున ఫీజు వసూలు చేయవచ్చునో, వినియమాలలో అందుకై నిర్దిష్టపరచునట్టి తేదీన మరియు ఆ తేదీ నుండి విషయముల బాబతున అట్టి ఫీజు ఏ స్కేలు ననుసరించి వసూలు చేయవచ్చునో నిర్దిష్టపరచవచ్చును:

అయితే, వేరువేరు విశ్వవిద్యాలయాలకు లేక వేరువేరు కోవలకు చెందిన కళాశాలలకు లేక వేరువేరు ప్రాంతాలకు సంబంధించి వేరువేరు విషయాలను మరియు వేరువేరు ఫీజు స్కేళ్లను అట్లు నిర్దిష్టపరచవచ్చును.

(3) ఏదేని పాఠ్యక్రమానికి సంబంధించి ఉపపరిచ్ఛేదం (2)లో నిర్దేశించిన స్వభావంగల వినియమాలు చేసినయెడల, అట్టి పాఠ్యక్రమాన్ని ఏర్పాటు చేయు ఏ కళాశాలయైనను అట్టి పాఠ్యక్రమంలో ప్రవేశించుటకు లేక దానిని చదువుటకు సంబంధించి ఎవరేని విద్యార్థి నుండి లేక ఆ విద్యార్థికి సంబంధించి–

(ఏ) అట్టి వినియమాలలో నిర్దిష్టపరచిన విషయం కానట్టి విషయం బాబతున ఎట్టి ఫీజును విధించరాదు లేక వసూలు చేయరాదు;

(బి) అట్టి వినియమాలలో నిర్దిష్టపరచిన ఫీజు స్కేలుకు మించి ఏదేని ఫీజును విధించరాదు లేక వసూలు చేయరాదు, లేక

(సి) ఏదేని చెల్లింపును (ఫీజుగా కాక ఇతర విధంగా) లేక ఏదేని విరాళమును లేక దానమును (నగదు రూపమునైనను, వస్తు రూపమునైనను) ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని స్వీకరించరాదు.

(4) నిర్దిష్ట పాఠ్యక్రమం ఏర్పాటు చేయు కళాశాల విషయంలో, వినియమాల ద్వారా నిబంధించిన రీతిలో పరిశీలన జరిపిన పిమ్మట, ఆకర్ణింపబడుటకు అట్టి కళాశాలకు యుక్తమైన అవకాశమును ఇచ్చిన పిమ్మట, అట్టి కళాశాల ఉపపరిచ్ఛేదం (3)లోని నిబంధనలను ఉల్లంఘించినదని కమీషను అభిప్రాయపడినచో, కేంద్ర ప్రభుత్వ పూర్వామోదంతో, కమీషను కళాశాలలో అప్పుడు అట్టి పాఠ్యక్రమంలో ఉన్న ఎవరేని విద్యార్థులను సంబంధిత అర్హతను పొందుటకై ఏదేని విశ్వవిద్యాలయమునకు హాజరుపరచకుండా అట్టి కళాశాలను నిషేధించుచు, ఉత్తరువు చేయవచ్చును.

(5) కమీషను, తాను ఉపపరిచ్ఛేదం (4) క్రింద చేసిన ఉత్తరువు ప్రతినొకదానిని సంబంధిత విశ్వవిద్యాలయమునకు పంపవలెను. అట్టి ఉత్తరువు ప్రతి విశ్వవిద్యాలయమునకు అందిన తేదీన మరియు ఆ తేదీ నుండి అట్టి కళాశాలకు అట్టి విశ్వవిద్యాలయంతో గల అనుబంధం అట్టి ఉత్తరువుతో నిర్దిష్టపరచినట్టి పాఠ్యక్రమాలకు సంబంధించినంతవరకు అంతమగును. అట్టి అనుబంధం అంతమైన తేదీన మరియు ఆ తేదీనుండి అటు తరువాతి మూడు సంవత్సరాల కాలావధి వరకు అట్టి

కళాశాలకు అట్టి లేదా అదేవిధమైన పాఠ్యక్రమానికి సంబంధించినంతవరకు ఆ విశ్వవిద్యాలయం గాని, ఏదేని ఇతర విశ్వవిద్యాలయం గాని అనుబంధమును మంజూరు చేయరాదు.

(6) ఏదేని కళాశాల అనుబంధం ఉపపరిచ్ఛేదం (5) క్రింద అంతమైన మీదట సంబంధిత విద్యార్థుల హితములను కాపాడుటకై కమీషను తాము సముచిత మని భావించునట్టి చర్యలన్నింటిని తీసుకొనవలెను.

(7) ఈ పరిచ్ఛేదపు నిబంధనలు మరియు ఈ పరిచ్ఛేదం నిమిత్తం చేసిన వినియమాలు, తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనంలో అందుకు అననుగుణంగా ఏమివున్నప్పటికినీ, అమలు కలిగియుండును.

గ్రాంటును స్వీకరించుటకు యోగ్యమైనదిగా కమీషను ప్రకటించునట్టి విశ్వవిద్యాలయమునకు ఏదేని గ్రాంటును ఇచ్చుటను గురించి నిషేధము.

12బి. విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషను (సవరణ) చట్టము, 1972 ప్రారంభమైన తరువాత స్థాపించినట్టి ఏదేని విశ్వవిద్యాలయము గ్రాంటు పొందుటకు యోగ్యమైనదిగా కమీషను, విహితపరచబడునట్టి విషయాలకు సంబంధించి తృప్తి చెందిన పిమ్మట తప్ప, అట్టి విశ్వవిద్యాలయమునకు కేంద్ర ప్రభుత్వం గాని, కమీషను గాని, కేంద్ర ప్రభుత్వము నుండి ఏవేని నిధులను స్వీకరిస్తున్న ఏదేని ఇతర వ్యవస్థగాని, ఎట్టి గ్రాంటును ఈయరాదు.

తనిఖీ.

13. (1) ఏదేని విశ్వవిద్యాలయం యొక్క ఆర్థిక అవసరాలను లేక దాని బోధన, పరీక్ష, పరిశోధనా ప్రమాణాలను తెలుసుకొను నిమిత్తం, ఆ విశ్వవిద్యాలయంతో సంప్రదించిన పిమ్మట కమీషను, తాను ఆదేశించునట్టి వ్యక్తి లేక వ్యక్తులచే విహితపరచునట్టి రీతిలో ఆ విశ్వవిద్యాలయం యొక్క ఏదేని శాఖను లేక శాఖలను తనిఖీ చేయించవచ్చును.

(2) కమీషను ఉపపరిచ్ఛేదం (1) క్రింద ఏదేని తనిఖీ చేయదలచిన తేదీని విశ్వవిద్యాలయమునకు తెలియజేయవలెను. విహితపరచునట్టి రీతిగా ఆ తనిఖీ సంబంధం కలిగియుండుటకు విశ్వవిద్యాలయమునకు హక్కు ఉండును.

(3) కమీషను, ఏదేని అట్టి తనిఖీ ఫలితాలకు సంబంధించి తన అభిప్రాయాలను విశ్వవిద్యాలయమునకు తెలియజేయవలెను. మరియు విశ్వవిద్యాలయము యొక్క అభిప్రాయమును తెలుసుకొనిన పిమ్మట, అట్టి తనిఖీ ఫలితంగా తీసుకొనవలసిన చర్యను విశ్వవిద్యాలయమునకు సిఫార్సు చేయవచ్చును.

(4) ఈ పరిచ్ఛేదం క్రింద విశ్వవిద్యాలయానికి తెలియజేయవలసిన వాటి నన్నింటిని ఆ విశ్వవిద్యాలయ కార్యపాలక ప్రాధికారికి పంపవలెను. ఉపపరిచ్ఛేదం (3) లో పేర్కొనినట్టి ఏదేని సిఫార్సును కార్యాన్వితం చేయు నిమిత్తం చేపట్ట దలచిన చర్య, ఏదేని ఉన్నచో, దానిని ఆ విశ్వవిద్యాలయ కార్యపాలక ప్రాధికారి కమీషనుకు నివేదించవలెను.

కమీషను సిఫార్సులను విశ్వవిద్యాలయాలు పాటించకుండుట వలన కలుగు పరిణామాలు.

14. ఏదేని విశ్వవిద్యాలయం 12వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదం (5)లో నిర్దేశించిన ఏదేని కళాశాలకు ఆ ఉపపరిచ్ఛేదపు నిబంధనలను ఉల్లంఘించి ఏదేని పాఠ్యక్రమం విషయంలో అనుబంధమును మంజూరు చేయుచో లేదా 12వ పరిచ్ఛేదం లేక 13వ పరిచ్ఛేదం క్రింద కమీషను చేసిన ఏదేని సిఫార్సును యుక్తమైన కాలం లోపల పాటించనిచో లేదా 25వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2)లోని ఖండము (ఎఫ్)

లేక ఖండము (జి) క్రింద చేసిన ఏదేని నియమం యొక్క నిబంధనలను లేదా 26వ పరిచ్ఛేదంలోని ఖండము (ఈ) లేక ఖండము (ఎఫ్) లేక ఖండము (జి) క్రింద చేసిన ఏదేని వినియమం యొక్క నిబంధనలను ఉల్లంఘించుచో, అట్లు పాటించకుండుటకు లేక ఉల్లంఘించినందులకు ఆ విశ్వవిద్యాలయం చూపించు కారణం ఏదేని ఉన్నచో, దానిని పర్యాలోచించిన పిమ్మట, కమీషను తమ నిధి నుండి ఆ విశ్వవిద్యాలయమునకు ఈయదలచిన గ్రాంట్లను నిలిపివేయవచ్చును.

కమీషనుకు చెల్లింపు.

15. కేంద్ర ప్రభుత్వం, ఈ విషయంలో శాసనము చేయుట ద్వారా పార్లమెంటు తగు విధంగా వినియోజనం చేసిన తరువాత, ఈ చట్టము క్రింద కమీషను కృత్యములను నిర్వహించుటకు అవశ్యకమని భావించునట్టి మొత్తములను ప్రతి ఆర్థిక సంవత్సరంలో కమీషనుకు చెల్లించవచ్చును.

కమీషనునిధి.

16. (1) కమీషనుకు సొంత నిధి ఉండవలెను; కేంద్ర ప్రభుత్వం ఆయా సమయములందు కమీషనుకు చెల్లించునట్టి మొత్తాలన్నింటిని, (ఏదేని రాజ్య ప్రభుత్వం లేదా ఏదేని ఇతర ప్రాధికార సంస్థ లేదా వ్యక్తి, కమీషనుకు ఇచ్చునట్టి ఏదేని మొత్తంలో సహా) కమీషను రాబడులన్నింటిని ఆ నిధికి జమచేయవలెను. చెల్లింపులన్నింటిని కమీషను ఆ నిధి నుండి చేయవలెను.

(2) నిధికి చెందిన మొత్తం డబ్బును, కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి లోబడి, కమీషను నిర్ణయించునట్టి బ్యాంకులలో డిపాజిటు చేయవలెను లేదా అట్లు కమీషను నిర్ణయించునట్టి రీతిలో పెట్టుబడి పెట్టవలెను.

(3) కమీషను ఈ చట్టము క్రింద తమ కృత్యములను నిర్వర్తించుటకు తాము సబబని తలచునట్టి మొత్తాలను ఖర్చు చేయవచ్చును. అట్టి మొత్తాలను కమీషను నిధి నుండి చెల్లించదగు వ్యయంగా పరిగణించవలెను.

బడ్జెటు.

17. కమీషను, ప్రతి సంవత్సరం రాబోవు ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన రాబడులను వ్యయములను చూపుచు, విహితపరచునట్టి ప్రరూపంలోను, అట్టి సమయమునను బడ్జెటును తయారుచేసి దాని ప్రతులను కేంద్ర ప్రభుత్వమునకు పంపవలెను.

వార్షిక నివేదిక.

18. కమీషను, ప్రతి సంవత్సరం ఒకసారి, విహితపరచునట్టి ప్రరూపంలోను అట్టి సమయమునను, గత సంవత్సరంలో తమ కార్యకలాపాలను గురించి వాస్తవమైన మరియు పూర్తి వివరాలను తెలుపుచు ఒక వార్షిక నివేదికను తయారుచేసి దాని ప్రతులను కేంద్ర ప్రభుత్వమునకు పంపవలెను. ఆ ప్రభుత్వం వాటిని పార్లమెంటు ఉభయ సదనముల సమక్షమున ఉంచవలెను.

లెక్కలు, ఆడిటు.

19. (1) కమీషను, లెక్కల విషయంలో, భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు-జనరలుతో సంప్రదించి విహితపరచునట్టి ప్రరూపంలోను మరియు అట్టి రీతిలోను అట్టి లెక్క పుస్తకాలను, తదితర పుస్తకాలను నిర్వహించునట్లు చేయవలెను.

(2) కమీషను, తమ వార్షిక లెక్కలను ముగింపు చేసిన పిమ్మట వెంటనే, కేంద్ర ప్రభుత్వం కంప్ట్రోలరు, మరియు ఆడిటరు-జనరలుతో సంప్రదించి నిర్ధారణ చేయునట్టి ప్రరూపంలో లెక్కల వివరణి నొకదానిని తయారుచేసి, అట్లు నిర్ధారణ చేసినట్టి తేదీనాటికి దానిని కంప్ట్రోలరు, మరియు ఆడిటరు-జనరలుకు పంపవలెను.

(3) కంప్ట్రోలరు, మరియు ఆడిటరు-జనరలు తాను సబబని తలచునట్టి సమయంలోను, అట్టి రీతిలోను కమీషను లెక్కలను ఆడిటు చేయవలెను.

(4) కమీషను యొక్క వార్షిక లెక్కలను, వాటిపై ఆడిటు నివేదికతో సహా కేంద్ర ప్రభుత్వానికి పంపవలెను. ఆ ప్రభుత్వం వాటిని పార్లమెంటు ఉభయ సదనముల సమక్షమున ఉంచవలెను. ఆడిటు నివేదిక వలన ఉత్పన్నమైన విషయాలపై సముచిత చర్య తీసుకొనుటకై ఆ ఆడిటు నివేదిక ప్రతినొకదానిని కమీషనుకు కూడా పంపవలెను.

## అధ్యాయము:-4

## వివిధ విషయములు

**కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు.**

20. (1) కమీషను ఈ చట్టము క్రింద తమ కర్తవ్యములను నిర్వర్తించుటలో, జాతీయ ప్రయోజనాలకు సంబంధించి పాలసీ విషయకమైన ప్రశ్నలపై కేంద్ర ప్రభుత్వము ఇచ్చునట్టి ఆదేశాలను మార్గదర్శకంగా తీసుకొనవలెను.

(2) ఏదేని ప్రశ్న జాతీయ ప్రయోజనాలకు సంబంధించి పాలసీ విషయకమైనదా కాదా అనుదానిని గూర్చి కేంద్ర ప్రభుత్వానికి కమీషనుకు మధ్య వివాదం ఏదైనా ఏర్పడినచో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అంతిమమైనదగును.

**వివరణులు మరియు సమాచారము.**

21. కమీషను, తన ఆస్తికి లేదా కార్యకలాపాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఆయా సమయములందు కోరునట్టి వివరణులను లేదా ఇతర సమాచారమును, కేంద్ర ప్రభుత్వానికి అందజేయవలెను.

**డిగ్రీలను ప్రదానం చేయు హక్కు.**

22. (1) కేంద్ర చట్టము, ప్రొవిన్షియల్ చట్టము లేక రాజ్య చట్టము ద్వారా లేక దాని క్రింద స్థాపించిన లేక నిగమితమొనర్చిన విశ్వవిద్యాలయం లేక 3వ పరిచ్ఛేదం క్రింద విశ్వవిద్యాలయంగా భావింపబడు సంస్థ లేక డిగ్రీలను ప్రదానం చేయుటకు లేక ఇచ్చుటకు పార్లమెంటు చట్టము ద్వారా ప్రత్యేకంగా అధికార మొసగబడిన సంస్థలు మాత్రమే డిగ్రీలను ప్రదానం చేయు లేక ఇచ్చు హక్కును వినియోగించవలెను.

(2) ఉపపరిచ్ఛేదము (1)లో నిబంధించిన విధముగా తప్ప ఏ వ్యక్తిగాని లేక ప్రాధికార సంస్థగాని ఏదేని డిగ్రీని ప్రదానము చేయరాదు లేక ఇవ్వరాదు లేక ఏదేని డిగ్రీని ప్రదానము చేయుటకు లేక ఇచ్చుటకు తనకు లేక దానికి హక్కు వున్నట్లు తెలియపరచరాదు.

(3) ఈ పరిచ్ఛేదం నిమిత్తం "డిగ్రీ" అనగా కేంద్ర ప్రభుత్వ పూర్వ మోదంతో కమీషను, రాజపత్రంలో అధిసూచన ద్వారా ఈ విషయంలో నిర్దిష్ట పరచునట్టి ఏదేని డిగ్రీ అని అర్థము.

**కొన్ని సందర్భాలలో "విశ్వవిద్యాలయము" అను పదమును ఉపయోగించుట నిషేధము.**

23. కేంద్ర చట్టము, ప్రొవిన్షియల్ చట్టము లేక రాజ్య చట్టము ద్వారా లేక దాని క్రింద స్థాపించిన లేక నిగమిత మొనర్చిన విశ్వవిద్యాలయం కానట్టి ఏ సంస్థగాని అది నిగమనికాయమైనను కాకున్నను, తన పేరుతోపాటు ఏ రీతిలోగాని "విశ్వవిద్యాలయము" అను పదమును కలిగియుండుటకు హక్కు ఉండదు.

అయితే, ఈ పరిచ్ఛేదంలో నున్నదేదియు, ఈ చట్టము ప్రారంభమై నప్పటి నుండి రెండు సంవత్సరాల కాలావధిపాటు, అట్టి ప్రారంభమునకు అవ్య వహితపూర్వం తన పేరుతోపాటు "విశ్వవిద్యాలయము" అను పదమును కలిగి యున్నట్టి సంస్థకు వర్తించదు.

శాస్తులు.

24. 22వ పరిచ్ఛేదపు నిబంధనలను గాని 23వ పరిచ్ఛేదపు నిబంధనలను గాని ఉల్లంఘించు వారెవరైనను, వేయి రూపాయల దాకా ఉండగల జుర్మానాతో శిక్షింపబడదగియుందురు మరియు అట్లు ఉల్లంఘన చేయుచున్న వ్యక్తి ఏదేని అసోసియేషను లేక వ్యక్తులతో కూడిన ఇతర నికాయమైనచో, అట్లు ఉల్లంఘించు టకు ఎరిగియుండి లేక బుద్ధిపూర్వకంగా ప్రాధికారమిచ్చు లేక అనుమతించు అట్టి అసోసియేషను లేక ఇతర నికాయంలోని ప్రతి సభ్యుడు వేయి రూపాయలదాకా ఉండగల జుర్మానాతో శిక్షింపబడదగియుండును.

నియమాలు చేయుటకు అధికారము.

25. (1) కేంద్ర ప్రభుత్వం ఈ చట్ట ప్రయోజనములను నెరవేర్చుటకై రాజపత్రంలో అధిసూచన ద్వారా నియమాలు చేయవచ్చును.

(2) ప్రత్యేకించియు, పైన చెప్పిన అధికారం యొక్క వ్యాపకతకు భంగం కలుగకుండ అట్టి నియమాలు ఈ క్రింది విషయాలన్నిటిని గురించి గాని లేక వాటిలో ఏవేని విషయాలను గురించి గాని నిబంధనలు చేయవచ్చును, అవేవనగా:-

(ఏ) 6వ పరిచ్ఛేదం క్రింద సభ్యుల పదవీ విరమణ కొరకు ప్రక్రియ;

(బీ) కమీషను సభ్యుడుగా కొనసాగుటకు నిరర్హతలు;

(సీ) కమీషను సభ్యుల సేవా నిబంధనలు, షరతులు;

(డీ) కమీషను నియమించిన ఉద్యోగుల సేవా నిబంధనలు, షరతులు;

(ఇ) 12వ పరిచ్ఛేదపు ఖండము (జె) క్రింద కమీషను నిర్వర్తించదగు నట్టి అదనపు కృత్యములు;

(ఎఫ్) విశ్వవిద్యాలయాలు తమ ఆర్థిక పరిస్థితి లేదా వాటిలో నిర్వహింపబడు బోధన మరియు పరీక్షా ప్రమాణాలకు సంబంధించి సమర్పించ వలసినట్టి వివరణలు మరియు సమాచారము;

(జీ) విశ్వవిద్యాలయాల తనిఖీ;

(హెచ్) కమీషను తయారుచేయవలసిన బడ్జెటు మరియు నివేదికల ప్రరూపము, రీతి;

(ఐ) కమీషను లెక్కలను నిర్వహించవలసిన రీతి;

(జె) కమీషను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించవలసిన రిటర్నులు, వివరణలు మరియు ఇతర సమాచారము యొక్క ప్రరూపము, రీతి;

(కె) విహితపరచవలసిన లేదా విహితపరచదగు ఏదేని ఇతర విషయము.

(3) ఈ పరిచ్ఛేదం ద్వారా నియమాలు చేయుటకు ఒసగబడిన అధికారములో, ఆ నియమాలకు లేదా అందలి ఏవేని నియమాలకు ఈ చట్టము ప్రారంభమగు తేదీ కంటె ముందుది కానట్టి తేదీ నుండి గతకాలిక ప్రభావం ఉండు నట్లు చేయు అధికారము కూడా చేరియుండును. అయితే ఏ నియమమునకు గాని అట్టి నియమం వర్తించదగునట్టి ఎవరేని వ్యక్తి హితములకు భంగం వాటిల్లు నట్లుగా గతకాలిక ప్రభావం ఉండునట్లు చేయరాదు.

వినియమాలు చేయుటకు అధికారము.

26. (1) కమీషను రాజపత్రంలో అధిసూచన ద్వారా—

(ఏ) కమీషను సమావేశములను, అందలి కార్యకలాపములను నిర్వహించు ప్రక్రియను క్రమబద్ధం చేయుచు;

(బీ) 9వ పరిచ్ఛేదం క్రింద కమీషనుతో వ్యక్తులకు సహసంబంధం ఏర్పరచదగు రీతిని మరియు ప్రయోజనాలను క్రమబద్ధం చేయుచు;

(సీ) కమీషను నియమించిన ఉద్యోగుల సేవా నిబంధనలను, షరతులను నిర్దిష్టపరచుచు;

(డీ) 2వ పరిచ్ఛేదపు ఖండము (ఎఫ్) క్రింద కమీషను ఏ సంస్థలను లేక ఏ కోవకు చెందిన సంస్థలను గుర్తించవచ్చునో నిర్దిష్టపరచుచు;

(ఇ) విశ్వవిద్యాలయ బోధనా సిబ్బందిలో నియమింపడు ఎవరేని వ్యక్తికి, అతడు బోధించవలసియుండు విద్వత్తు శాఖను దృష్టియందుంచుకొని, అతనికి సాధారణంగా వుండవలసినట్టి అర్హతలను నిర్వచించుచు;

(ఎఫ్) ఏదేని విశ్వవిద్యాలయం, ఏదేని డిగ్రీని ఇచ్చుటకు కనీస బోధనా ప్రమాణాలను నిర్వచించుచు;

(జీ) విశ్వవిద్యాయాలలో ప్రమాణాలను నిర్వహించుటను, పనిని లేదా సౌకర్యాలను సమన్వయపరచుటను క్రమబద్ధం చేయుచు;

(హెచ్) 12వ పరిచ్ఛేదపు ఖండము (సిసిసి)లో నిర్దేశించిన సంస్థల స్థాపనను, అట్టి సంస్థలకు సంబంధించిన ఇతర విషయాలను క్రమబద్ధం చేయుచు;

(ఐ) 12ఏ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదం (2) క్రింద ఒక కళాశాల ఏ విషయాల బాపతున ఫీజు వసూలు చేయవచ్చునో, ఏ స్కేలు ననుసరించి అట్టి ఫీజు వసూలు చేయవచ్చునో నిర్దిష్టపరచుచు;

(జె) 12ఏ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదం (4) క్రింద పరిశీలన జరుపదగునట్టి రీతిని నిర్దిష్టపరచుచు;

ఈ చట్టమునకు, దాని క్రింద చేయబడిన నియమాలకు అనుగుణంగా, వినియమాలు చేయవచ్చును.

(2) కేంద్ర ప్రభుత్వ పూర్వామోదంతో తప్ప ఉపపరిచ్ఛేదం (1) లోని ఖండం (ఏ) లేదా ఖండం (బి) లేదా ఖండం (సి) లేదా ఖండ్ం (డి) లేదా ఖండం (హెచ్) లేదా ఖండం (ఐ) లేదా ఖండం (జె) క్రింద ఎట్టి వినియమమును చేయరాదు.

(3) ఉపపరిచ్ఛేదం (1) లోని ఖండం (ఐ) మరియు ఖండం (జె) మినహా ఈ పరిచ్ఛేదం ద్వారా వినియమాలు చేయుటకు ఒసగబడిన అధికారంలో ఆ వినియమాలకు లేదా అందు ఏవేని వినియమాలకు, ఈ చట్టం ప్రారంభమగు తేదీ కంటె ముందుది కానట్టి తేదీ నుండి గతకాలిక ప్రభావం ఉండునట్లు చేయు అధికారం కూడా చేరియుండును. అయితే ఏ వినియమమునకు గాని అట్టి వినియమము వర్తించదగునట్టి ఎవరేని వ్యక్తి హితములకు భంగం, వాటిల్లునట్లుగా గతకాలిక ప్రభావం ఉండునట్లు చేయరాదు.

ప్రత్యాయోజనము చేయు అధికారము

27. (1) రాజపత్రంలో అధిసూచన ద్వారా ఈ చట్టం క్రింద చేసిన వినియమాల ద్వారా కమీషను తమ కార్యాలయ నిర్వహణ, అంతర్గతపాలనకు సంబంధించి చేసిన వ్యయమును గురించిన అధికారాలతో సహా, కమీషనుచే లేక కమీషనులో జరుపబడు కార్యకలాపాలపై తనకు గల సాధారణ పర్యవేక్షక మరియు ఆదేశిక అధికారాలను తను అధ్యక్షునికి ఉపాధ్యక్షునికి లేదా తమ అధికారులలో ఎవరికైనను ప్రత్యాయోజనం చేయవచ్చును.

(2) కేంద్ర ప్రభుత్వ పూర్వామోదంతో తప్ప ఈ పరిచ్ఛేదం క్రింద ఎట్టి వినియమమును చేయరాదు.

నియమాలను, వినియమాలను పార్లమెంటు సమక్షమున ఉంచుట.

28. ఈ చట్టం క్రింద చేసిన ప్రతి నియమమును, ప్రతి వినియమమును దానిని చేసిన పిమ్మట వీలయినంత శీఘ్రంగ, పార్లమెంటు అధివేశనంలోనున్న సమయమున మొత్తం ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను. ఆ ముప్పది దినములు ఒకే అధివేశనంలో గాని వరుసగా వచ్చు రెండు లేక అంతకెక్కువ అధివేశనములలోగాని చేరియుండవచ్చును. పైన చెప్పిన అధివేశనమునకు లేక వరుసగా వచ్చు అధివేశనములకు వెనువెంటనే వచ్చు అధివేశనం ముగియుటకు పూర్వమే ఆ నియమములో లేదా వినియమములో ఏదేని మార్పు చేయుటకు ఉభయ సదనములు అంగీకరించినచో లేక ఆ నియమమును లేదా వినియమమును చేయరాదని ఉభయ సదనములు అంగీకరించినచో, అటు పిమ్మట, ఆ నియమము లేదా వినియమము అట్లు మార్పుచేసిన రూపంలో మాత్రమే ప్రభావం కలిగియుండును లేక సందర్భానుసారంగ ప్రభావరహితమైయుండును; అయిననప్పటికినీ, ఏదేని అట్టి మార్పుగాని, రద్దుగాని అంతకుపూర్వం ఆ నియమము క్రింద లేదా వినియమం క్రింద చేసిన దేని శాసనమాన్యతకైనను భంగం కలిగించదు.